క్లుప్తంగా...

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్ హేమానగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరం 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు తీసుకోవాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీ కొత్త చక్రపాణిగౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయంలో పూజలు



అల్వాల్: సంకటహర చతుర్థి సందర్భంగా అల్వాల్ లోతుకుంటలోని విజయ గణపతి దేవాలయంలో లారీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షులు అశోక్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రామంతాపూర్: బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తండ్రి ఎంజే మురళీధర్‌రావు ఇటీవల కన్నుమూసిన విషయం విదితమే. సోమవారం కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రామంతాపూర్‌లోని ప్రభాకర్ స్వగృహంలో ఆయనను, ఆయన కుటుంబ సభ్యులు పరామర్శించి మురళీధర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదానం



మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణంలో మధుమోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోగులు, వారి బంధువులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మధుమోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఉప్పల్: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉప్పల్‌కు చెందిన కాలమిస్ట్, రచయిత కోట దామోదర్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్, రాష్ట్ర అధ్యక్షుడు మాడా రాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల మండలాలు కమిటీలతో చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

నాచారంలో క్రోమా స్టోర్



మల్లాపూర్: టాటా గ్రూప్‌నకు చెందిన క్రోమా స్టోర్‌ను సోమవారం నాచారం డివిజర్ న్యూరాఘవేంద్రనగర్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రోమా ఇన్ఫినిటీ రిటైల్ లిమిటెడ్ ఎండీ సీఈవో అవిజిత్ మిత్రా మాట్లాడుతూ.. క్రోమా నూతన షోరూమ్‌ను నాచారంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విస్తరణతో తమ వినియోగదారులకు మరింత సన్నిహితంగా చేరడంతో పాటు అత్యున్నత శ్రేణి, వినూత్న ఉత్పత్తులు, ఆఫర్లను అందిస్తున్నామన్నారు.

జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు అర్హత

ఘట్‌కేసర్: తెలంగాణ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 3–7 వరకు సిద్దిపేట్‌లో జరిగిన జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఘట్‌కేసర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గుంటి సత్యనారాయణ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. దీంతో యోగా టోర్నీలో అంపైర్‌గా చేసే అవకాశం ఆయనకు లభించింది.

రాకపోకలకు నిత్యం నరకం

- పెద్దచెరువు వద్ద కొనసాగుతున్న నాలా నిర్మాణం
- నత్తనడకన సాగుతున్న పనులతో ఇబ్బంది
- ఉప్పల్–రామంతాపూర్ మార్గంలో తప్పని తిప్పలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు





కంకర తేలి శిథిలమైన రోడ్డు

రామంతాపూర్: ప్రధాన రహదారి పెద్ద చెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న నాలా పనులతో రోడ్డు మొత్తం ఇరుగ్గా మారిపోయింది. దీంతో ఈ ఇరుకు రోడ్డు నుంచే రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలు ఉప్పల్ నుంచి రామంతాపూర్ వైపు వచ్చే వాహనాలు కొనసాగిస్తున్నాయి. అయితే ఈ నాలా పనులు జరుగుతున్న ప్రాంతంలో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిపోయి కంకర తేలి గుంతలుగా మారింది. ఈ రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పూర్తయ్యే వరకు కనీసం ఈ రోడ్డుకు తాత్కాలికంగానైనా మట్టి పోసి చదును చేసి ప్యాచ్ వర్క్‌లు చేపట్టి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈఎస్ఐ ఎంప్లాయీస్ జేఏసీ ఆవిర్భావం

కమిటీ చైర్మన్‌గా డాక్టర్ చీమ శ్రీనివాస్

మల్లాపూర్: రాష్ట్ర ఈఎస్ఐలో ఉన్న ఉద్యోగ సంఘాలు (టీజీజీడీఏ, టీఎన్‌జీవో, బీఆర్ఎస్‌కేవీ, టీజీఎంజీయూ) అన్ని కలిసి సోమవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఈఎస్ఐ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ సలహాదారులుగా డాక్టర్ వెంకటేష్ బాబు, డాక్టర్ నాగేందర్, చైర్మన్‌గా డాక్టర్ చీమ శ్రీనివాస్, కన్వీనర్లుగా వి.వేణుకుమార్, రాజ్‌కుమార్, కోశాధికారి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా డాక్టర్ సతీష్‌కుమార్, ఓంప్రభు, శ్రీనయ్య, ధన్‌రామ్, శ్రీనివాస్, కో కన్వీనర్లుగా డాక్టర్ రవి, గంగాశంకర్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈఎస్ఐని నిర్వీర్యం చేయడానికి చేస్తున్న కుట్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈఎస్ఐకి వెంటనే ఓ వైద్యుడిని డైరెక్టర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఈఎస్ఐలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. మెరుగైన వైద్య అందించడానికి సౌకర్యాలు, పరికరాలను అందించాలని కోరారు.



తెలంగాణ ఈఎస్ఐ ఎంప్లాయిస్ జేఏసీ నూతన కమిటీ

ఆర్టీసీ అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలి

బోడుప్పల్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులంతా అంకితభావంతో పని చేస్తేనే లాభాల బాటలోకి తీసుకురాగలమని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో సోమవారం ఉద్యోగులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలనతోపాటు ఓఆర్, ఈపీకే, కేఎంపీఎల్ అధికంగా తీసుకురావాలని కోరారు. కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాణిక్యమ్మ ఒక్కరోజులో 50 టీఏవైఎల్ టిక్కెట్లు అమ్మడంతో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఈసు, అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

కుషాయిగూడ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కన్జూమర్ గ్రీవెన్స్ మీట్‌ను ఏర్పాటు చేసినట్లు సైనిక్‌పురి ఇన్‌చార్జి డీఈ ఎస్.సుభాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌలాలి డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్, వినియోగదారుల ఫోరం సభ్యులు హాజరై వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతారన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం జరుగుతుందన్నారు. విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఫోన్: 94910 67109.

భగత్‌సింగ్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా శంకర్



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా సానాది శంకర్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన అధ్యక్షుడి ఎన్నికల్లో 42 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శంకర్ మాట్లాడుతూ గతంలో మూడు పర్యాయాలు పనిచేశానని, కాలనీ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరోమారు కాలనీ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, క్రిష్ణయ్య, కటారి తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి

మల్లాపూర్: నాచారం డివిజన్ కార్తికేయనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీవాసులు చంద్రశేఖర్, అఫ్సర్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ



మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు సోమవారం సర్కిల్ కార్యాలయం ఆవరణంలో అందజేశారు. అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ దివ్యాంగులు అందరూ బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఇక్కడికే వచ్చి దరఖాస్తులు తీసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. 50 మందికి పాస్‌లు అందజేసి మరో 50 మంది దరఖాస్తులను అధికారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రజనీకాంత్, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైన్ షాప్‌లో అగ్నిప్రమాదం

రూ.కోటి ఆస్తి నష్టం

మల్లాపూర్: మల్లాపూర్ చౌరస్తాలోని స్వర్ణ వైన్స్ షాప్‌లో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సర్వీస్ అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్వర్ణ మద్యం దుకాణంలో బీర్ల ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. దీంతో షాపులో ఉన్న ఫర్నిచర్, ఫాల్ సీలింగ్, మద్యం బ్యాటిల్స్ అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా దట్టమైన మంటలు, పొగ, శబ్దాలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న నాచారం ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. షాప్ అంతస్తులో ఉన్న ముగ్గురు కార్మికులను సురక్షితంగా కిందికి తీసుకువచ్చారు.ఈ ఘటనలో దాదాపు రూ. కోటి విలువైన మద్యం బాటిళ్లు అగ్నికి అహుతయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రియాంకగాంధీ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



అల్వాల్ నుంచి సరూర్‌నగర్ తరలివెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తదితరులు

అల్వాల్: నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ యువ సంఘర్షణ సభకు వచ్చిన సందర్భంగా సోమవారం అల్వాల్ నుంచి డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు ర్యాలీగా పెద్దఎత్తున తరలివెళ్లారు. ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పేదలను దగా చేసిన ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా సాగుతున్న పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలిపాక అంజయ్య, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, నాయకులు వంజరి సంతోష్, షబ్బీర్ అలీ, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు భారీగా యువ సంఘర్షణ సభకు తరలి వెళ్లారు.



రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో యువ సంఘర్షణ సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

ముంపు సమస్యను పరిష్కరించండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: సత్తిరెడ్డినగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కార్పొరేటర్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. చిన్నపాటి వర్షానికే నాలాలు నిండి మురుగు నీరు రోడ్డుమీద, ఇండ్లలోని వస్తోందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, బాక్స్ డ్రైన్ నిర్మాణంతో పాటు రోడ్డు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చామకూర మల్లారెడ్డి

బోడుప్పల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం కోసం టెక్నీప్ ఎఫ్ఎంసీ కంపెనీ నిధులు కోటి రూపాయల వ్యయంతో ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోందని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా భవనాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు అన్ని వర్గాల ప్రజలు చదువుకునే విధంగా పాఠశాలలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. టెక్నీప్ ఎఫ్ఎంసీ కంపెనీ రూ.2 కోట్లు భవన నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, తొలి విడత రూ.కోటి అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం భూమిపూజలో మంత్రి మల్లారెడ్డి

నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలి



ఓల్డ్ అల్వాల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓల్డ్ అల్వాల్ శివాలయం వద్ద రూ.20 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో అలసత్వం వీడాలన్నారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీవాసులు కిషన్‌రావు, కిషోర్‌కుమార్, రాంచందర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మచ్చబొల్లారంను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చబొల్లారం డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారి భాస్కర్, మల్లికార్జున్, జీహెచ్ఎంసి ఈఈ రాజు, ఏఈ రవళి, కాలనీవాసులు అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్, అధికారులు

చర్లపల్లి ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్

బంక్‌ను ప్రారంభించిన వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: చర్లపల్లి ప్రధాన రహదారి పక్కన ఓం శ్రీనవదుర్గ పెట్రోలియం బంక్‌ను సోమవారం కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంగిచర్ల ప్రాంతవాసులకు ఈ బంక్ అందుబాటులో ఉందన్నారు. క్వాలిటీ, నమ్మకంతో వినియోగదారులకు పెట్రోల్ అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కొత్త లక్ష్మీరవిగౌడ్, కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కొత్త స్రవంతిగౌడ్, కొత్త దుర్గమ్మ, కొత్త చందర్‌గౌడ్, నాయకులు దయాకర్, కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.



ఆపదలో ఉన్నవారికి అండగా..

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తోందని ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శాగ మల్లేష్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసిన బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి స్పందించి ఆర్థిక సాయం అందించారు. బీఎల్ఆర్ ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి జంపాల్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. సామాజిక సేవాభావనతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దూసరి నవీన్‌గౌడ్, మధుగౌడ్, మంజుల, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- నిబంధనలు పాటించడం లేదంటూ కాలనీ ప్రతినిధుల ఆరోపణ
- అన్ని ఏర్పాట్లు చేశామంటున్న ఆస్పత్రి యాజమాన్యం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ సుభాష్‌నగర్ ప్రధాన రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నారని సుభాష్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపించారు. సోమవారం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనీస సెట్‌బ్యాక్, పార్కింగ్ సౌకర్యం లేకుండా వంద పడకల ఆస్పత్రిని ఏ విధంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయం కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘించి ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దాసరి కృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద సుభాష్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అన్ని వసతులు ఏర్పాటు చేసుకుంటున్నాం..

ఆస్పత్రి నిర్వహణకు కావాల్సిన అన్ని వసతులను తాము సమకూర్చుకున్నట్లు భవన యజమాని అన్మోల్ కార్తీక్ వివరణ ఇచ్చారు. పార్కింగ్ కోసం పక్కనే ఉన్న 600 గజాల స్థలాన్ని లీజుకు తీసుకొని పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బందిని అందుబాటులో ఉంచి వాహనదారులు, స్థానికులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఉప్పల్: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర సాధనకు పద్మశాలీలు ముందుండి ఉద్యమించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ తొమ్మిది సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడంతో పద్మశాలీలు, చేనేత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో హ్యాండ్లూమ్ సొసైటీ, పవర్ లూమ్స్ సొసైటీల్లో పనిచేస్తున్న వేలాది మంది చేనేత కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నారాయణ, బోడ విద్యాసాగర్, చింతకింది ప్రవీణ్, గోనె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న పద్మశాలీలు